విలేఖరులు కావలెను

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com

ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

తెలుగు జాతీయ దిన పత్రిక

TELTEL/2012/47103

సంపుటి : 12 సంచిక :93 నల్గొండ శుక్రవారం 27-06-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ పేజీలు : 4 వెల : రూ.1/-

## ఉద్యోగులు,పెన్షనర్లకు ప్రభుత్వం గుడ్ న్యూస్



హైదరాబాద్, జూన్ 26: బోనాలు పండగ ప్రారంభమైన వేళ ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. పెండింగ్‌లో ఉన్న రూ. 180.30 కోట్ల మేర మెడికల్ బకాయిలను క్లియర్ చేసినట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గురువారం హైదరాబాద్‌లో వెల్లడించారు. దీని వల్ల 26, 519 మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ఊరట లభించనుందన్నారు. గత ప్రభుత్వంలోని పెండింగ్ బిల్లులనూ సైతం క్లియర్ చేసినట్లు ఆయన వివరించారు.రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయన్నారు. అయినా భారీ ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. అయినప్పటికి ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులకు ప్రాధాన్యత ఇస్తూ ఈ బకాయి నిధులను విడుదల చేసినట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోదాహరణగా విపులీకరించారు. ఈ పెండింగ్ బకాయిలు విడుదల చేయడం పట్ల ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ లేఖ.. పోలింగ్ వీడియో ఇవ్వాలని డిమాండ్

ముంబై:మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలపై కాంగ్రెస్ ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. కాంగ్రెస్ ఓటర్ల జాబితా, పోలింగ్ రోజు నాటి వీడియో ఫుటేజీని ఇవ్వాలని డిమాండ్ చేసింది. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లేవనెత్తిన అంశాలకు సంబంధించి లేఖను పంపింది. మహారాష్ట్ర, హర్యానా ఓటర్ల జాబితాల డిజిటల్, మెషిన్-రీడబుల్ కాపీలను వారంలోగా అందుబాటులో ఉంచాలని కాంగ్రెస్ తన లేఖలో స్పష్టంగా పేర్కొంది. అలాగే, పోలింగ్ రోజు వీడియో రికార్డింగ్‌ను ఇవ్వాలని కోరింది. తమ డిమాండ్‌ను పరిష్కరించడం ఎన్నికల సంఘానికి కష్టమైన పనేం కాదని పేర్కొంది. తమ ఈ డిమాండ్ కూడా కొత్తదేం కాదని.. ఈ విషయంలో పార్టీ చాలాకాలంగా డిమాండ్ చేస్తుందని చెప్పారు.రాజకీయ పార్టీల విశ్వాసాన్ని పెంచడమే కాకుండా, ఎన్నికల ప్రక్రియలో ప్రజల విశ్వాసాన్ని నిలుపుకోవాలని కోరింది. అయితే, పార్టీ అగ్రనాయకత్వ బృందం ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు సిద్ధంగా ఉందని కాంగ్రెస్ తెలిపింది. మొత్తం ప్రక్రియపై బహిరంగ చర్చ జరిగేలా విశ్లేషించడంతో పాటు ఆధారాలను కమిషన్ ముందుంచనున్నది. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలను బహిర్గతం చేసే డేటా,



విశ్లేషణ తమ వద్ద ఉందని పార్టీ పేర్కొంది. మహారాష్ట్ర, హర్యానాలో ఇటీవల జరిగిన ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ పనితీరుపై ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నలు లేవనెత్తిన విషయం తెలిసిందే. ముఖ్యంగా మహారాష్ట్రలో ఓటర్ల జాబితాలో అక్రమాలు, ఓటింగ్‌లో పారదర్శకత లేదంటూ ఆరోపిస్తూ వస్తున్నది.

## ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం మళ్లీ రావొచ్చేమో : ట్రంప్

వాషింగ్టన్,ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం ముగిసిన విషయం తెలిసిందే. రెండు దేశాల మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందంతో గత 12 రోజులుగా సాగిన యుద్ధం ముగిసింది. దీంతో పశ్చిమాసియాలో కూడా ఉద్రిక్తతలు కాస్త చల్లారాయి. ఇప్పుడిప్పుడే అన్ని కార్యకలాపాలూ మొదలయ్యాయి. ఇంతలోనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం మళ్లీ రావొచ్చేమో అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ఆ రెండు దేశాలతో నేను మాట్లాడి ఉద్రిక్తతలను పరిష్కరించాను. ప్రస్తుతం ఆ రెండు దేశాలూ అలసిపోయాయి. అవి మళ్లీ యుద్ధాన్ని ప్రారంభిస్తాయా..? అంటే ఏదో ఒకరోజు అది సాధ్యమేనని నేను అనుకుంటున్నా. ఇది త్వరలోనే ప్రారంభం కావొచ్చు కూడా' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య గడిచిన 12 రోజులుగా కొనసాగిన యుద్ధానికి కాల్పుల విరమణ ఒప్పందంతో తెరపడింది. ఇరు దేశాల మధ్య సయోధ్య కోసం ఇజ్రాయెల్‌తో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంప్రదింపులు జరిపినప్పటికీ ఇరాన్‌తో కుదరలేదు. దీంతో ట్రంప్ కోరిక మేరకు రంగంలోకి దిగిన ఖతార్.. ఇరాన్‌ను ఒప్పించింది. మొత్తంగా ఖతార్ మధ్యవర్తిత్వం కారణంగానే ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధానికి తెరపడిందని చెప్పొచ్చు. దీంతో 30 లక్షల జనాభా కూడా లేని ఈ పశ్చిమాసియా దేశంపై అందరి దృష్టి పడింది.

మా దాడి తర్వాత మొస్సాద్ ఏజెంట్లు అణు కేంద్రాలకు వెళ్లారు: ట్రంప్

ఇంటర్నెట్‌డెస్క్: ఇరాన్ అణుకేంద్రాలపై తాము దాడి చేసిన తర్వాత ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్‌కు చెందిన ఏజెంట్లు అక్కడికి వెళ్లి పరిశీలించారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. అగ్ర రాజ్య దాడుల్లో ఇరాన్‌కు ఊహించినంత నష్టం జరగలేదంటూ.. పెంటగాన్‌ను ఉటంకిస్తూ కథనాలు వెలువడిన నేపథ్యంలో ఆయన ఈవిధంగా స్పందించారు. ట్రంప్ నాటో సదస్సులో మాట్లాడుతూ "మీకు తెలుసా వాళ్ల (ఇజ్రాయెల్) మనుషులు అక్కడికి వెళ్లి పరిశీలించి పూర్తిగా ధ్వంసమైనట్లు తెలిపారు. ఇప్పుడు ఇజ్రాయెల్ దానిపై ఓ నివేదిక తయారుచేస్తోంది. పూర్తిగా ధ్వంసమైందని వారు చెప్పడంతోపాటు.. నేను కూడా నమ్ముతున్నాను. ఏదీ మిగిలే అవకాశం లేదు" అని ఫోర్డో కేంద్రం గురించి పేర్కొన్నారు.



ఆ కేంద్రాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి: సీఐఏ

ఇరాన్‌లోని అణు కేంద్రాలు అమెరికా దాడిలో తీవ్రంగా దెబ్బతిన్నాయని సీఐఏ కూడా ధ్రువీకరించింది. ఈమేరకు దాని డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ ప్రెస్‌నోట్ విడుదల చేశారు. అక్కడి కేంద్రాలు ధ్వంసం కావడం వల్ల చాలాకాలం వరకు అవి కోలుకొనే పరిస్థితి లేదన్నారు. వీటి పునర్ నిర్మాణానికి కొన్నేళ్ల సమయం పడుతుందన్నారు. "ఇటీవల జరిగిన దాడుల్లో ఇరాన్ అణు కార్యక్రమం తీవ్రంగా దెబ్బతిన్నట్లు నమ్మకమైన ఇంటెలిజెన్స్ విభాగం ఒకటి వెల్లడించింది. మరిన్ని వివరాలను మేం సేకరించి పాలకులకు అందిస్తాం. దీంతోపాటు అమెరికా ప్రజలకు కూడా తెలియజేస్తాం. జాతీయ ప్రాధాన్యం ఉన్న అంశం కావడంతో పూర్తిగా పారదర్శకంగా వ్యవహరిస్తాం" అని సీఐఏ పేర్కొంది. మరోవైపు నిన్న ఇరాన్ విదేశాంగశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘయీ కూడా అణుకేంద్రాలు దెబ్బతిన్న విషయాన్ని అంగీకరించారు. కాకపోతే.. పూర్తి వివరాలను వెల్లడించేందుకు నిరాకరించారు. అమెరికాతో పాటు ఇజ్రాయెల్ కూడా పదేపదే దాడులు చేయడంతో తీవ్రంగా విధ్వంసం జరిగిందన్నారు. మరోవైపు న్యూయార్క్‌టైమ్స్, సీఎన్ఎన్ మాత్రం పెంటగాన్ నివేదికను ఉటంకిస్తూ.. అమెరికా దాడులు ఇరాన్ అణుకేంద్రాలపై పెద్దగా ప్రభావం చూపలేదని పేర్కొన్నాయి. దీనికితోడు టెహ్రాన్ మరికొన్ని నెలల్లోనే పూర్తిస్థాయిలో యురేనియం శుద్ధి చేపట్టే అవకాశం ఉందని వెల్లడించాయి.

## పుణెకు సై.. హైదరాబాద్‌కు నై



హైదరాబాద్: మహారాష్ట్రలోని పుణెలో మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన కేంద్ర మంత్రివర్గం... హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణ ప్రతిపాదనలను మాత్రం విస్మరించింది. మహారాష్ట్ర సర్కారుతో కలిసి పుణె మెట్రో రెండో దశను చేపట్టేందుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. కానీ, హైదరాబాద్ మెట్రో రెండో దశ 'ఏ' భాగానికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను కేంద్రానికి సమర్పించి 8 నెలలు కావొస్తున్నా స్పందన కరవైంది. ఈ ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు కోరింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రధాని మోదీని పలుమార్లు కలిసి విన్నవించారు. గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిని సీఎం ఇటీవల స్వయంగా కలిసి మెట్రో విస్తరణకు ఆమోదం తెలపాలని కోరారు. బుధవారం నాటి కేంద్ర మంత్రివర్గ సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైలు అంశమే చర్చకు రాకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది.

ఐదు కారిడార్లతో ప్రతిపాదనలు..

హైదరాబాద్ మెట్రో రెండో దశ మొదటి భాగంలో ఐదు కారిడార్లను ప్రతిపాదించారు. 76.4 కి.మీ.గాను రూ.24,269 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేశారు. డీపీఆర్‌లను గతేడాది జులై 26న రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. నవంబరు 2న పరిపాలనాపరమైన అనుమతులు జారీ చేసింది. ఒక్కో కారిడార్ డీపీఆర్‌లతో పాటు హెచ్ఎండీఏ పరిధి వరకు సిద్ధం చేసిన కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్(సీఎంపీ) ట్రాఫిక్ అధ్యయన నివేదిక, ప్రత్యామ్నాయ రవాణా ప్రణాళికలు, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పరిపాలనా అనుమతులను జత చేసి... నవంబరు 4న కేంద్రానికి పంపారు. ప్రాజెక్టు పూర్తయితే 8 లక్షల మంది ప్రయాణికులకు అత్యాధునిక, కాలుష్యరహిత రవాణా సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ట్రాఫిక్ పెరుగుదల దృష్ట్యా మెట్రో విస్తరణ అత్యవసరమని చెప్పారు. రాష్ట్ర ప్రతిపాదన పరిశీలనలో ఉందని కేంద్రం ఇటీవల తెలిపింది. పుణె రెండో దశ పూర్తయితే 2027 నాటికి నిత్యం 96 వేల మంది ప్రయాణిస్తారని అంచనా. ప్రయాణికుల సంఖ్య తక్కువే అయినా ఆ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన కేంద్రం... అందుకు 8 రెట్ల మంది ప్రయాణించే హైదరాబాద్ మెట్రో విస్తరణను విస్మరించడం సరికాదని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటోంది.

సంయుక్త ప్రాజెక్టుగా...

మెట్రో 2(ఏ) ప్రాజెక్టు మొత్తం వ్యయంలో 30 శాతం అంటే రూ.7,313 కోట్లను తాము భరిస్తామని, కేంద్ర ప్రభుత్వం తన వాటా 18 శాతం కింద రూ.4,230 కోట్లు భరించాలని, మరో 48 శాతం రూ.11,693 కోట్లను జైకా(జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ) వంటి సంస్థల నుంచి రుణాలు తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. మిగిలిన 4 శాతం పీపీపీ ద్వారా సమకూర్చుకునేలా ప్రాజెక్టును డిజైన్ చేశారు. కాగా, మెట్రో 2(బి)లోని మూడు కారిడార్లలో 86.1 కి.మీ. ప్రతిపాదనలకు సంబంధించి డీపీఆర్‌లను రాష్ట్ర ప్రభుత్వం శనివారమే కేంద్రానికి సమర్పించింది.

## పర్యాటక రంగ అభివృద్ధికి ప్రణాళికలు : మంత్రి జూపల్లి కృష్ణారావు



హైదరాబాద్: రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధి కి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని, టూరిజం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తూ ఈ రంగం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం ముందుకు వెళుతుందోందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు అన్నారు. సోమశిల వెల్నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టు అభివృద్ధిలో భాగంగా మంత్రి జూపల్లి సోమశిల, అమరగిరి, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, నార్లాపూర్ రిజర్వాయర్, కొల్లా పూర్లోని మాధవస్వామి ఆలయం, జెటప్రోలు మదనగోపాల స్వామి దేవాలయాన్ని సందర్శించారు.

Saski ప్రాజెక్టుకు రూ.68.10 కోట్లు మంజూరు

పర్యాటక అభివృద్ధికి ఉన్నఅవకాశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సోమశిల వెల్నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టుకు స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ / యూనియన్ టెరిటరిస్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్టమెంట్ పథకం కింద రూ.68.10 కోట్లు మంజూరయ్యాయని, ఆ నిధులతో పర్యావరణం, జల వనరులు, ఆలయాలు, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ గేమ్స్ కు పుష్కలమైన వనరులు ఉన్న సోమశిల, అమరగిరి ద్వీపం, ఈగలపెంటను అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని పర్యాటక శాఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం కొల్లాపూర్ క్యాంప్ కార్యాలయంలో సోమశిల వెల్నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టు సంబంధించిన ప్రతిపాదనలు, కార్యాచరణపై పర్యాటక శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రపంచంలో ఎన్నో దేశాలు కేవలం టూరిజం ద్వారానే అభివృద్ధి చెందాయని, రాష్ట్రాన్ని టూరిజం హబ్ మార్చేందుకు ప్రభుత్వ శాఖలు సమన్వ యంతో ముందుకు వెళ్లాలన్నారు. త్వరలో టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. పర్యాటక రంగాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో ముందుకు తీసుకెళ్తామని, ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని అన్నారు.దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సోమశిల వెల్నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టుకు స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్/యూనియన్ టెరిటరిస్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట మెంట్(సాస్కి) పథకంకింద రూ.68.10 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఆ నిధులతో పర్యా వరణం, జల వనరులు, ఆలయాలు, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ గేమ్స్కు పుష్కలమైన వనరు లు ఉన్న సోమశిల, అమరగిరి ద్వీపం, మల్లేశ్వ రం, ఈగలపెంటను అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టామని వివరించారు. క్లస్టర్ ఈగల పెంట అరైవల్ జోన్, ఈగలపెంట విహార యాత్ర, ఈగలపెంట రివర్ క్రూయిజ్, చెంచు ట్రైబల్ఎక్స్పీరియన్స్, క్లస్టర్ రెండు సోమశిల వెల్నెస్ అండ్ స్పిరిచ్యువల్ రిట్రీట్ ఉంటాయని అన్నారు. సోమశిలలో బోటింగ్ జెట్టి, అమరగిరి ద్వీపంలో బోటింగ్ జట్టి, కాటేజీలు, స్విమ్మింగ్ పూల్, కేఫ్టీరియా, స్పా, వెల్ నెస్ సెంటర్, ఇండోర్, అవుట్ డోర్ గేమ్స్, ఇతర సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్ర మంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరు, కలెక్టర్ బదావత్ సంతోష్, ఇతర అధికారులు ఉన్నారు.

### మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీని ప్రారంభించిన మంత్రి సీతక్క

ములుగు : జిల్లా కేంద్రంలోని తంగేడు మైదానంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తంగేడు మైదానం వద్ద ర్యాలీని జెండా ఊపి మంత్రి ప్రారంభించారు. ర్యాలీ డీఎల్ఆర్ గార్డెన్ వరకు కొనసాగింది.విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు చేరాలని మంత్రి సీతక్క సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, ఎస్ పి డాక్టర్ పి. షబరిష్, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జీ, అదనపు ఎస్పీ సదానందం, గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్ తదితరులు పాల్గొన్నారు.

## సగం ధరకే మలేరియా వ్యాక్సిన్.. ప్రకటించిన భారత్ బయోటెక్ చైర్మన్..!

హైదరాబాద్, ప్రపంచంలోనే తొలి పిల్లల మలేరియా వ్యాక్సిన్ తక్కువ ధరకే అందుబాటులోకి తీసుకురానున్నట్లు భారత్ బయోటెక్ ప్రకటించింది. హైదరాబాద్‌కు చెందిన ఫార్మా దిగ్గజం 2028 నాటికి వ్యాక్సిన్ ధరను సగానికి పైగా తగ్గిస్తామని ప్రకటించింది. దాంతో వ్యాక్సిన్ రూ.429కే అందుబాటులోకి రానున్నది. భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్, జీఎస్‌కే పీఎల్‌సీ తాము అభివృద్ధి చేస్తున్న ఆర్‌టీఎస్-ఎస్ వ్యాక్సిన్‌ను తగ్గిస్తామని ప్రకటించాయి. గతంలో వ్యాక్సిన్ ధర రూ.859కు అందుబాటులో ఉండేది. ప్రస్తుతం ధర కనీసం 60శాతం తగ్గనున్నది.రెండు కంపెనీలు వ్యాక్సిన్ల తయారీ ప్రక్రియను మెరుగుపరచడంతో పాటు ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించడం, ఖర్చులను తగ్గించుకొని తక్కువ లాభాల ద్వారా వ్యాక్సిన్‌ను 2028 నాటికి వ్యాక్సిన్‌ను తగ్గిస్తామని రెండు కంపెనీలు ప్రకటించాయి. ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా ఆఫ్రికా, భారత్ వంటి ప్రభావిత దేశాల్లో పిల్లలకు మలేరియా సోకకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ వ్యాక్సిన్లు వేయనున్నారు. వాస్తవానికి ఏటా ఐదులక్షల మందికిపైగా పిల్లలు మలేరియా బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ క్రమంలో ఆఫ్రికాలో పిల్లలకు తక్కువ ధరకే మలేరియా వ్యాక్సిన్లు అందించేందుకు వ్యాక్సిన్ అలయన్స్ (గ్లాక్సోస్మిత్‌క్లైన్) గవి అనే స్వచ్ఛంద సంస్థ పని చేస్తోంది.ఈ సంస్థకు జీఎస్‌కే వ్యాక్సిన్లు సరఫరా చేస్తూ వస్తున్నది. ఈ సందర్భంగా భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్లా మాట్లాడుతూ.. జీఎస్‌కే, పాత్ తదితర ఫార్మా కంపెనీలు కలిసి ఆర్‌టీఎస్-ఎస్ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఈ వ్యాక్సిన్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదం లభించిందని.. జేఎస్‌కే ఈ వ్యాక్సిన్ టెక్నాలజీని



భారత్ బయోటెక్‌కు బదిలీ చేసిందని చెప్పారు. వ్యాక్సిన్‌ను తయారు చేసేందుకు గవికి సరఫరా చేసేందుకు 2021లోనే ఒప్పందం కుదిరిందన్నారు. వ్యాక్సిన్ల తయారీ, అభివృద్ధి కోసం భారత్ బయోటెక్ 200 మిలియన్ల పెట్టుబడి పెట్టిందన్నారు.చారిత్రాత్మక ప్రకటన ద్వారా కోట్లాది మంది పిల్లలు, కుటుంబాలను మలేరియా భూతం నుంచి కాపాడబోతున్నామన్నారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, ప్రక్రియ మెరుగుదలలు, చౌకైన తయారీ పద్ధతులు, కనీస లాభ విధానం ద్వారా ఈ ధర తగ్గింపు సాధ్యమైంది. మలేరియాను ఎదుర్కోవడానికి శాశ్వత పరిష్కారాన్ని కనుగొనడానికి 2021 నుంచి భారత్ బయోటెక్‌తో కలిసి పనిచేస్తున్నామని జీఎస్‌కే చీఫ్ గ్లోబల్ హెల్త్ ఆఫీసర్ థామస్ బ్రూయర్ అన్నారు.

## యువత మత్తు వదిలితేనే భవిష్యత్తు..



కరీమాబాద్,జూన్ 26 : యువత మత్తు వదిలితేనే భవిష్యత్తు ఉంటుందని వరంగల్ ఆర్పీఎఫ్ ఇన్ స్పెక్టర్ యాదగిరి గౌడ్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని రైల్వే ప్రయాణికులకు వరంగల్ ఆర్పీఎఫ్ ఇన్ స్పెక్టర్ యాదగిరి గౌడ్, జీఆర్పీ పోలీసుల ఆధ్వర్యంలో రైల్వే ప్రయాణికులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు వదిలితేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. మత్తు పదార్థాలను అరికట్టడానికి పోలీసుల తో పాటు ప్రజలు కూడా ప్రయత్నించాలన్నారు. మత్తు అనేది యువతకు హాని కలిగించే పదార్థమని, వాటికి దూరంగా ఉంచేందుకు తల్లిదండ్రులు, సమాజ సేవకులు ప్రయత్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్ స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు,ఏఎస్ఐఎం.విరావు,జీఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.

## యువతకు ఆర్యజనని మంచి అవకాశం

హైదరాబాద్, దివ్యమైన సంతానం కోరుకునే దంపతులకు రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో మార్గనిర్దేశం చేస్తున్న ఆర్య జనని యువతకు స్కాలర్ షిప్పులు అందించేందుకు మరోసారి ముందుకు వచ్చింది. ఇందుకోసం18 నుంచి 30 సంవత్సరాల లోపు యువతీ యువకులకు జాతీయస్థాయి ఆన్‌లైన్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించనుంది. స్వామి వివేకానంద ప్రాక్టికల్ వేదాంత, జ్ఞాన యోగ ప్రసంగాల ఆధారంగా రూపొందించిన నాలెడ్జ్ స్ట్రెంత్ అనే పుస్తకంపై టెస్ట్ నిర్వహించనుంది. మాక్ టెస్ట్ జూలై 20న జరగనుంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఆర్యజనని వెబ్సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డాక్టర్ అనుపమ రెడ్డి తెలిపారు. మెయిన్ క్విజ్ ఆగస్టు మూడున జరగనుంది. విజేతలైన 150 మంది యువతీ యువకులకు ఆకర్షణీయ స్కాలర్షిప్పులు అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8977863881 నెంబర్ కు వాట్సాప్ చేయాలని సూచించారు. హైదరాబాద్ రామకృష్ణ మఠం లోని వివేకానంద హెల్త్ సెంటర్‌లో సేవలందిస్తున్న ప్రత్యేక వైద్యుల బృందం 2018 సంవత్సరంలో ఆర్యజనని ప్రారంభించింది. అనేక మంది ఉత్సాహవంతులైన, సేవాభావతత్పరులైన వైద్యులు, యోగా నిపుణులు, క్లినికల్ సైకాలజిస్టులు, సాఫ్ట్‌వేర్ నిపుణులు, గాయకులు ఆర్యజనని బృందంలో ఉన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా గత 5 సంవత్సరాలుగా, ఆర్యజనని సంస్థ, కాబోయే తల్లి తండ్రులకు "స్పృహతో కూడిన గర్భధారణ, పేరెంటింగ్" గురించి అవగాహన కల్పించే విధంగా ఆఫ్ లైన్, ఆన్ లైన్ వర్క్ షాప్ లు నిర్వహిస్తోంది. ఇది గర్భిణీ స్త్రీలు, వారి శిశువుల శ్రేయస్సు కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన కార్యక్రమం. యోగా, ధ్యానం, బేబీ బాండింగ్ టెక్నిక్స్, ఆత్మీయ గానం, ప్రెగ్నెన్సీ లైఫ్ స్టైల్ తదితర అంశాలతో కూడిన ఈ 3గంటల వర్క్ షాప్ ఆధ్యాత్మికత, ఆధునిక విజ్ఞానంతో కూడిన అద్భుతమైన మేళవింపు. కడుపులో పెరుగుతున్న శిశువు యొక్క శారీరక, భావోద్వేగ, మేధోపరమైన, ఆధ్యాత్మిక ఉన్నతికి ఈ వర్క్ షాప్ ఎంతో ఉపయోగపడుతుంది.

## రాయదుర్గంలో యువతి అనుమానాస్పద మృతి

హైదరాబాద్, రాయదుర్గంలో ఓ యువతి ఓయో హోటల్లో యువతి సూసైడ్ చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం... నల్లగండ్లలో నివాసం ఉంటున్న అనూష (26) బ్యూటీషియన్‌గా పనిచేస్తున్నారు. అనూషకు పెళ్లి జరిగినప్పటికీ భర్తతో విభేదాలు తలెత్తాయి. దీంతో భర్త నుంచి విడిపోయిన యువతి.. తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. వారిని చూసుకుంటూ బ్యూటీషియన్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఈనెల 22న సాయంత్రం ఆరు గంటల సమయంలో స్నేహితుల వద్దకు వెళుతున్నట్లు యువతి తల్లిదండ్రులకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లింది. అయితే రాత్రి గడిచినప్పటికీ అనూష ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆమెకు ఫోన్ చేసినప్పటికీ స్పందించకపోవడంతో యువతి కోసం గాలించడం మొదలుపెట్టారు. బంధువులను ఫోన్ చేసి అనూష గురించి ఆరా తీశారు. అయితే ఎవరూ రాలేదని చెప్పడంతో వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే రాయదుర్గంలోని క్యాబిన్ ఓయో లాడ్జ్‌లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది అనూష. ఈ విషయాన్ని ఓయో లాడ్జ్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించగా... వారు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే అనూష ఎందుకు సూసైడ్ చేసుకుందనే విషయం తెలియాల్సి ఉంది. యువతి మృతి విషయంపై తల్లిదండ్రులకు సమాచారం అందించారు పోలీసులు. కానీ యువతి ఆత్మహత్యపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. అసలు యువతి లాడ్జ్‌కు ఎందుకు వచ్చింది.. యువతితో పాటు ఎవరైనా వచ్చారా.. ఆత్మహత్యకు గల కారణాలు ఏంటి.. యువతిది ఆత్మహత్యా లేక హత్యా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఏం సాధించారు?

టెహ్రాన్:మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో 12 రోజుల పాటు నడిచిన యుద్ధం ప్రస్తుతానికి కాల్పుల విరమణతో ఆగిపోయింది. ప్రస్తుతానికి ప్రపంచదేశాలన్నీ ఊపిరిపీల్చుకున్నాయి. ఇరాన్ అణు స్థావరాలపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలతో దాడులు చేయడంతో ఈ యుద్ధం ప్రారంభమైంది. ఇరాన్ కూడా తగిన విధంగా డ్రోన్లతో ఇజ్రాయెల్ నగరాలపై విరుచుకుపడింది. ఇరు వైపులా వందల సంఖ్యలో ప్రజలు చనిపోయారు. ఇది చాలాదన్నట్లు అమెరికా కూడా "ఆపరేషన్ మిడ్‌నైట్ హామర్" పేరుతో భారీ బంకర్ బస్టర్ బాంబులతో ఇరాన్ అణు కేంద్రాలపై దాడులు చేసింది. అమెరికా దాడిని ప్రపంచదేశాలన్నీ తప్పు బట్టాయి. ఇది అంతర్జాతీయ చట్టాలకు పూర్తి విరుద్ధమని విమర్శించాయి. రష్యా అయితే తమ అణుబాంబులు ఇరాన్ కు అందిస్తామని పరోక్షంగా వ్యాఖ్యలు చేసింది. కానీ ఇరాన్ ఖతార్ లోని అమెరికా ఎయిర్ బేస్ పై బాలిస్టిక్ మిసైల్స్ తో దాడులు చేయడంతో సీన్ మొత్తం మారిపోయింది. దీంతో ఈ యుద్ధం ఇక గల్ఫ్ దేశాలన్నింటికీ వ్యాపిస్తుందని భయపడుతున్న వేళ. అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ యుద్ధం ఆపేస్తున్నాం అని చెప్పి.. కాల్పుల విరమణ ప్రకటించారు. అయితే ఇదంతా జరిగాక.. ఇప్పుడు ఈ మూడు దేశాలు గెలుపు మాదే నంటే కాదు మేము విజయం సాధించామని ప్రకటనలు చేస్తున్నాయి. నిజానికి ఈ యుద్ధంలో ఏ దేశం ఏం సాధించింది? అనే ప్రశ్న తలెత్తుతుంది.

### మూడు దేశాల విజయ ప్రకటనలు

యుద్ధంలో ఈ విరామంతో.. అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్ మూడు దేశాలు ఇది తాము సాధించిన విజయంగా చెప్పుకుంటున్నాయి. ఇరాన్ యొక్క అణు సామర్థ్యాన్ని బలహీనపరిచినట్లు అమెరికా చెప్పుకుంటోంది. ఇరాన్‌ను గణనీయంగా బలహీనపరిచినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. మరోవైపు ఇరాన్ నాయకులు కూడా ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన దేశమైన అమెరికాని ఎదిరించి నిలబడ్డామని చెప్పుకుంటోంది. ఈ మూడు దేశాలు తమ ప్రజలను ఒప్పించడానికి ఇదే ప్రచారాన్ని ఉపయోగిస్తున్నాయి.

### అమెరికా ఏం సాధించింది?

అమెరికా ఎప్పుడూ ఇరాన్, ఇజ్రాయెల్ సంఘర్షణకు దౌత్యపరమైన పరిష్కారాన్ని సమర్థించింది. కానీ ఆదివారం.. దాని B-2 బాంబర్లు ఇరాన్‌లోని మూడు అణు కేంద్రాలపై దాడి చేశాయి. ట్రంప్ ఇరాన్‌ను "మధ్యప్రాచ్యంలో బెదిరింపు శక్తి" అని పిలిచి, శాంతిని కోరకపోతే మరింత దాడులు ఉంటాయని హెచ్చరించారు. అయితే, ఇరాన్ ఖతార్‌లోని అమెరికా మిలిటరీ ఎయిర్ బేస్‌పై దాడి చేసిన తర్వాత, ట్రంప్ దాడి చేయకూడదని నిర్ణయించారు. ఎందుకంటే ఇరాన్ ముందుగా హెచ్చరిక ఇచ్చింది. ఈ దాడిలో అమెరికన్లు గాయపడలేదు, కనుక ట్రంప్ శాంతి స్థాపకుడిగా కనిపించారు.

### ఇజ్రాయెల్ సాధించిన విజయం

అమెరికా దాడులకు ముందు, ఇజ్రాయెల్.. ఇరాన్ యొక్క అణు, సైనిక లక్ష్యాలపై దాడులు చేసి, ఇరాన్ యొక్క వైమానిక రక్షణ వ్యవస్థలను నాశనం చేసింది. అంతేకాకుండా ఇరాన్ కు చెందిన ముఖ్య సైనిక నాయకులను ఇజ్రాయెల్ హతమార్చింది. అమెరికా దాడులు ఇజ్రాయెల్‌కు పెద్ద లాభాన్ని చేకూర్చాయి.

## పవన్‌తో స్కెచ్.. తమిళనాడులో బీజేపీ చరిత్ర తిరగరాస్తుందా?



అమరావతి,ద్రవిడ రాజకీయాల్లో హిందూత్వ.. ప్రభావం చూపుతుందా..? తమిళనాడు నేలపై ఈసారి ఎలాగైనా జెండా పాతేందుకే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను బీజేపీ.. ట్రంప్‌కార్డుగా ప్రయోగిస్తోందా..? కమలం అగ్రనాయకత్వం గీసిన స్కెచ్ ఏ మేరకు వర్కవుటవుతుంది..? ప్రస్తుతం దీనిపైనే పొలిటికల్ వర్గాల్లో చర్చ. ఆపరేషన్ తమిళనాడు..! గత కొన్నేళ్లుగా బీజేపీ టార్గెట్ ఇదేనని చెప్పాలి. దక్షిణాది రాష్ట్రాల్లో తమిళనాడు పాలిటిక్సే వేరు. జాతీయ పార్టీలకంటే ఇక్కడ ప్రాంతీయ పార్టీల హవానే ఎక్కువ. అందుకే.. కేంద్రంలో ఏ నేషనల్ పార్టీ పవర్‌లో ఉన్నా.. తమిళనాట మాత్రం అయితే డీఎంకే, లేదంటే అన్నాడీఎంకే అన్నట్లుగానే ఇప్పటివరకు రాజకీయం సాగింది. అలాంటి చోట ఈసారి పాగా వేయాలని భావిస్తున్నారు కమలనాథులు. 2026లో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయాలను హీటెక్కిస్తున్నారు కాషాయ పార్టీ నేతలు. ఇందులో భాగంగానే ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ అధినేత, సినీ నటుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను రంగంలోకి దింపారన్న మాట ఆఫ్‌లైన్లో విన్పిస్తోంది. కమలం అధినాయకత్వం ప్లాన్‌లో భాగంగానే పవన్ మధురైలో పర్యటించారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పేరుకు మురుగన్ భక్తుల మహానాడులో పవన్ పాల్గొన్నా ఆయన చేసిన హిందూత్వ ప్రసంగమే ఇందుకు నిదర్శనమన్న కామెంట్లు విన్పిస్తున్నాయి.

### హిందూత్వను బలంగా వినిపిస్తున్న జనసేనాని

అంతా ఊహించినట్లుగానే సభా వేదికపై నుంచే హిందూత్వ వాదాన్ని మరోసారి బలంగా విన్పించారు పవన్ కల్యాణ్. పదహారేళ్ల వయసులోనే తాను శబరిమల వెళ్లినట్లుగా తెలిపారు పవన్. ఇంట్లో విభూతి పెట్టుకొని మరీ బడికి వెళ్లేవాడినని చెప్పుకొచ్చారు. తాను అన్ని మతాలను గౌరవిస్తానని.. అలాగే హిందువు అయినందుకు ఎంతో గర్వపడతానంటూ లక్షలాదిగా వచ్చిన భక్తుల మధ్య ప్రకటించారు పవన్. మార్పు రావాలంటే ధైర్యం ఉండాలంటూ ఇదే వేదికపై నుంచి గర్జించారు పవన్. అసలు మురుగనే తొలి విప్లవనాయకుడని, ఆయనకు బేధభావం లేదన్నారు. అందరూ సమానమేనన్నారు పవన్. ఎలుకల సంఖ్య ఎంత ఉన్నా నాగుపాము గట్టిగా శబ్దం చేస్తే వాటంతటవే పరుగు తీస్తాయన్నారు. ఈ నమ్మకంతోనే మార్పు వస్తుందని కచ్చితంగా తాను నమ్ముతానన్నారు పవన్. మురుగన్ భక్తుల మధ్య ఏపీ డిప్యూటీ సీఎం పవన్ చేసిన ఈ కామెంట్ల పైనే డీఎంకే భగ్గుమంటోంది. ఏ ప్రయోజనాలు ఆశించి తమిళనాడులో నిర్వహించిన కార్యక్రమానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌ను ఆహ్వానించారని బీజేపీకి ప్రశ్నలు సంధిస్తోంది డీఎంకే.

### బీజేపీ సౌత్‌లో గట్టి పట్టున్నది కర్ణాటకలోనే

కేవలం ఇప్పుడే కాదు.. కొన్ని రోజుల క్రితం సైతం పవన్ కల్యాణ్ తమిళనాడులో పర్యటించారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ కార్యక్రమంలో భాగంగా తమిళనాడులో పర్యటించిన ఆయన.. డీఎంకేను ఉద్దేశిస్తూ ఘాటైన వ్యాఖ్యలే చేశారు. జమిలీ ఎన్నికలను డీఎంకే అధినేత కరుణానిధి కోరుకున్నారని..కానీ, ఇప్పుడు అవే ఎన్నికలను ఆయన కుమారుడు స్టాలిన్ వ్యతిరేకిస్తున్నారంటూ ఫైరయ్యారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ కారణంగా ప్రాంతీయ పార్టీలకు దెబ్బ తగులుతుంది అన్న విమర్శలను ఈ సందర్భంగా కొట్టిపారేశారు పవన్ కల్యాణ్. దక్షిణాదిలోని తమిళనాట పాగా వేయాలని గట్టి ప్రయత్నం చేస్తున్నారు కాషాయ పార్టీ నేతలు. కానీ, వాళ్ల ప్లాన్లు మాత్రం పెద్దగా వర్కవుట్ కావడం లేదనే చెప్పాలి. నిజానికి%ా% సౌత్‌లో బీజేపీకి బాగా పట్టున్నది ఒక్క కర్ణాటకలోనే. ఇప్పటికే పలుమార్లు అక్కడ సొంతంగానూ, మిత్ర పక్షాల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది బీజేపీ. పైగా యడ్యూరప్ప లాంటి దిగ్గజ నేతలు ఆ పార్టీలో ఉండి రాష్ట్ర రాజకీయాలను కొన్నేళ్ల పాటు శాసించారు.

### ఏపీలో అధికార భాగస్వామిగా ఉన్న కమలం పార్టీ

ఇక, రెండు తెలుగు రాష్ట్రాల్లో భిన్నమైన పరిస్థితి నెలకొంది. ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కట్టుగా 2024 ఎన్నికల్లో పోటీ చేసి బంపర్ విక్టరీ కొట్టాయి. దీంతో.. ఏపీలోనూ కమలం పార్టీ అధికారంలో ఉన్నట్లుగానే భావించాలి. తెలంగాణలో మాత్రం కమలం పార్టీకి చెప్పుకోదగిన స్థాయిలోనే సంఖ్యా బలముంది. ప్రధానంగా ఆ పార్టీ తరపున 8 మంది ఎంపీలున్నారు. అసెంబ్లీలోనూ 8 మంది ఎమ్మెల్యేలున్నారు. 2018 ఎన్నికలతో పోలిస్తే 2023లో బీజేపీ చాలా బలపడింది. కానీ, అధికారం అంటారా ఇప్పుడప్పుడే కష్టమనే అభిప్రాయం ఆ పార్టీ నేతల నుంచే వ్యక్తమవుతోంది. మరో దక్షిణాది రాష్ట్రమైన కేరళలో కమలనాథుల ప్రభావం అంతంత మాత్రమే. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కేరళ నుంచి కేవలం ఒకే ఒక్క ఎంపీ స్థానం గెలిచింది బీజేపీ. ప్రముఖ మలయాళ నటుడు సురేష్ గోపి త్రిస్సూర్ నుంచి విజయం సాధించి కేంద్ర మంత్రి వర్గంలో చోటు సంపాదించారు.

### ద్రవిడ గడ్డపై పట్టుకోసం కమలనాథుల ఆరాటం

ఇలా దక్షిణాదిలోని అన్ని రాష్ట్రాల్లో తనదైన ప్రభావం చూపిస్తున్న బీజేపీకి ద్రవిడ గడ్డపై మాత్రం పట్టు చిక్కడం లేదు. వాస్తవానికి 2014 ఎన్నికల వేళ%ా% నాటి ప్రధాన మంత్రి అభ్యర్థిగా ఉన్న నరేంద్రమోడీ స్వయంగా తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ ఇంటికి వెళ్లారు. ఆ తర్వాత ప్రధానిగా మోడీ అయిన తర్వాత కూడా ఇరువురి మధ్యా మంచి స్నేహమే నెలకొంది. కానీ, రజనీకాంత్ మాత్రం కమలనానికి మద్దతు ఇవ్వలేదు. దీంతో.. 2024 సార్వత్రిక ఎన్నికల కోసం అన్నామలైని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడ్ని చేసింది. దీంతో.. ఆయనా దూకుడుగా వ్యవహరించారు. కానీ, ఫలితం మాత్రం పెద్దగా రాలేదు. ఇలాంటి వేళ 2026 ఎన్నికల నాటికి తమిళనాడు అసెంబ్లీలో చెప్పుకోదగిన స్థాయిలో సీట్లను సాధించాలంటే హిందూత్వ అజెండాను మరింత ఉధృతంగా విన్పించే నాయకులైతేనే బెటర్ అన్నట్లుగా కాషాయ పార్టీ నేతలు ఆలోచించినట్లు సమాచారం. అన్ని రకాలుగా ఆలోచించి చివరకు జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను రంగంలోకి దింపినట్లుగా తెలుస్తోంది. గత కొన్నాళ్లుగా సనాతన ధర్మం గురించి గట్టిగా తన వాయిస్ విన్పిస్తున్న పవన్‌ను ట్రంప్ కార్డుగా ఉపయోగించి మురుగన్ భక్తులను ఆకట్టుకోగలిగితే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మంచి మైలేజ్‌తోపాటు సీట్లు వస్తాయన్నది కమలనాథుల ఆలోచనగా తెలుస్తోంది. చూడాలి మరి.. బీజేపీ ప్లాన్ ఎంతవరకు వర్కవుటవుతుందో.

## కొనసాగుతున్న ఆపరేషన్ 'సింధు'

న్యూఢిల్లీ,ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య వార్ కారణంగా అక్కడ చిక్కుకున్న భారతీయుల్ని రప్పించేందుకు కేంద్రం చేపట్టిన 'ఆపరేషన్ సింధు' కొనసాగుతోంది. ఈ ఆపరేషన్ ద్వారా ఇజ్రాయెల్, ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయుల్ని స్వదేశానికి తీసుకొస్తోంది. పొరుగు దేశాలకు చెందిన పౌరులకు కూడా భారత్ ఆపరేషన్ సింధు ద్వారా సాయం చేస్తోంది. ఈ ఆపరేషన్ ద్వారా ఇప్పటికే పలువురు భారతీయులు స్వదేశానికి చేరుకున్న విషయం తెలిసిందే.

# విరమణ... నిజంగానా?



టెహ్రాన్:ఎప్పటిలాగే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బహుపాత్రాభినయంతో అందరినీ మెప్పిస్తున్నారు. పశ్చిమాసియాలో అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ దాడులు సాగించిన కొన్ని గంటలకే ఇరాన్ ఇజ్రాయెల్ కాల్పుల విరమణకు అంగీకరించాయని, దాన్ని తాము స్వాగతిస్తున్నా మని మంగళవారం మధ్యాహ్నం ట్రంప్ ప్రకటించారు. దీనికి ఇరాన్ సానుకూలంగా స్పందించినా ఇజ్రాయెల్ మౌనం పాటించింది. ట్రంప్ ప్రకటించిన కాసేపటికే ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై అది బాంబుల వర్షం కురిపించింది. రెండు దేశాలూ పరస్పరం 'ఎందుకో కూడా తెలియని' విధంగా కాల్పుల విరమణ ఒడంబడికను ఉల్లంఘిస్తున్నాయని ట్రంప్ నిందించి తన 'తటస్థతను' చాటు కున్నారు! ఇంతకూ కాల్పుల విరమణ నిజమేనా? ఒక సమాచారం ప్రకారం ఖతార్‌లోని అమెరికా స్థావరంపై ఇరాన్ క్షిపణులు ప్రయోగించాక ట్రంప్ చొరవ తీసుకుని ఇరాన్‌తో మాట్లాడి కాల్పుల విరమణకు ఒప్పించమని ఖతార్‌ను కోరారు. ఖతార్ తీసుకొచ్చిన ప్రతిపాదనకు ఇరాన్ అంగీకారం తెలిపింది. ఇరాన్ ఈ సంగతి బాహాటంగానే చెప్పింది. కాల్పుల విరమణ గురించి ట్రంప్ బతిమా లుకున్నారని వెల్లడించింది. అయితే ట్రంప్ ప్రకటన తర్వాత కాసేపటికే దాడులకు దిగడాన్నిబట్టి ఇజ్రాయెల్‌కు ఈ పరిణామం ససేమిరా ఇష్టం లేదని బోధపడుతోంది. యుద్ధం ఆపటం సులభమేమీ కాదు. కాల్పుల విరమణ ప్రకటనకూ, దాని ఆచరణకూ మధ్య గంటలు మాత్రమే కాదు... రోజుల వ్యవధి కొనసాగటం రివాజే. మొన్న భారత్%-%పాక్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పంద మైనా, రష్యా-ఉక్రెయిన్‌ల కాల్పుల విరమణ అయినా ఈ సంగతే చెబుతాయి. యుద్ధానికి ముందు నెల నుంచి ట్రంప్ ఇరాన్‌కు రోజువారీ హెచ్చరికలు జారీచేస్తూ వచ్చారు. అణు ఒప్పందంపై మొండి పట్టుదలకు పోతే దేశం సర్వనాశనమవుతుందని బెదిరించారు. ఆఖరికి ఒకపక్క ఇరాన్ అమెరికాతో చర్చలు సాగిస్తుండగానే పన్నెండు రోజుల క్రితం ఇజ్రాయెల్ ఎలాంటి కవ్వింపూ లేకుండా ఆ దేశంపై దాడులు సాగించి ఇరాన్ సైనిక దళాల చీఫ్‌లు ఇద్దరినీ, అణు శాస్త్రవేత్తలతోసహా పలువురినీ హత్య చేసింది. ఇది తప్పని చెప్పాల్సిన ట్రంప్... ప్రతీకార దాడులకు దిగితే ఖబడ్దార్ అంటూ తిరిగి ఇరాన్‌నే హెచ్చరించారు. ఆఖరికి శనివారం అర్ధరాత్రి దాటాక అమెరికా తానే రంగంలోకి దిగి బంకర్ బస్టర్ బాంబులతో ఇరాన్‌లో మూడు అణు స్థావరాలను ధ్వంసం చేశామని ప్రకటించింది. ఇంతా అయినాక హఠాత్తుగా ట్రంప్ కొత్త రాగం అందుకున్నారు. ఏకపక్ష యుద్ధం ప్రారంభానికి పూర్వమే ఇరాన్ బలహీనతలు బయటపడ్డాయి. దశాబ్దాల ఆంక్షలతో అన్నివిధాలా దెబ్బతిన్న దేశం మెరుగ్గా ఉండగలదని ఎవరూ భావించలేరు. ఒకపక్క నేరుగా అమెరికా, ఇజ్రాయెల్ కుటిలత్వం తెలుస్తున్నా మిత్రులనుకున్నవారు కూడా ఖండించ టానికి సిద్ధపడకపోవటం... అండగా ఉండగలవని భావించిన రష్యా, చైనాలు ప్రకటనలకే పరిమితం కావటం, గల్ఫ్ దేశాలు నామమాత్రంగా ఖండించి ఊరుకోవటం ఇరాన్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసి ఉంటాయి. అణు ఒప్పందానికి సిద్ధపడతామని ప్రకటించి ఆ దిశగా అడుగులేస్తున్న దేశం ప్రపంచంలో ఇలా ఏకాకిగా మిగిలిపోవటం వర్తమాన విషాదం. యుద్ధం పర్యవసానంగా ఇరాన్‌లో పలు దేశాల పెట్టుబడులు దెబ్బతింటాయి. పైగా ప్రపంచానికి పెద్ద పోలీసుగా వ్యవహరిస్తూ తాము చెప్పిందే ఒప్పందమని ఒత్తిడి తెచ్చే ధోరణి రేపన్నరోజు ఎవరికైనా ముప్పే. ఇజ్రాయెల్ దగ్గర... ఆ మాటకొస్తే పశ్చిమాసియాలో అణుబాంబుల జాడలేకపోతే, ఇరాన్ మాత్రమే ఆ పని చేస్తే దాన్ని నియంత్రించటంలో హేతుబద్ధత ఉన్నదని నమ్మినా తప్పుబట్టనవసరం లేదు. కానీ అసలు అమెరికా, రష్యా మొదలుకొని ఏకపక్ష యుద్ధాలతో అందరూ తమ బాధ్యతారాహిత్యాన్ని బయటపెట్టుకుంటుండగా ఒక్క ఇరాన్ మాత్రమే ధూర్త దేశమని ఎందుకు భావించాలి? ఇంతకూ ట్రంప్ హఠాత్తు నిర్ణయం వెనకున్న కారణాలేమిటి? సైనిక స్థావరంపై దాడి చేస్తున్నా మని ఇరాన్ ముందస్తు సమాచారం ఇవ్వటం, అందుకు అనుగుణంగా అమెరికా తన సైనికుల్ని తరలించటంతోపాటు క్షిపణుల్ని కూల్చే ఏర్పాటు చేసుకోవటం సాధ్యమైంది. ఒకే ఒక్కటి పేలినా దానివల్ల నష్టం లేదు. అది ట్రంప్‌కు నచ్చినట్టుంది. దానికితోడు ఆయన అందలం ఎక్కటంలో కీలకపాత్ర పోషించిన 'మాగా' ఈ యుద్ధంపై చీలిపోయింది. గట్టి మద్దతుదారైన స్టీవ్ బెనన్ లాంటివారు సైతం ట్రంప్‌ను తప్పుబట్టారు. ఆ ఒత్తిళ్ల మాటెలావున్నా యూరప్ నుంచి వస్తున్న వార్తలు అమెరికాను భయపెట్టి ఉండాలి. అమెరికా తర్వాత బంగారం నిల్వల్లో రెండు, మూడు స్థానాల్లో ఉన్న జర్మనీ (3,352 టన్నులు), ఇటలీ (2,452 టన్నులు) ఆ నిల్వల్లో మూడోవంతు భాగాన్ని అమెరికా ఫెడరల్ రిజర్వ్‌లో ఉంచాయి. దాన్ని వెనక్కుతేవాలని ఆ దేశాల్లో డిమాండ్లు బయల్దేరాయి. నిల్వల విలువ 24,500 కోట్ల డాలర్ల పైమాటే. ఫెడరల్ రిజర్వ్ స్వతంత్రతను దెబ్బతీసేలా ట్రంప్ వ్యవహరించటం, ప్రపంచాన్ని అస్థిరపరిచే నిర్ణయాలు తీసుకోవటం తదితర కారణాల వల్ల అమెరికాలో బంగారం ఉంచటం సురక్షితం కాదని విపక్షాలు వాదిస్తున్నాయి. అది ఆచరణ రూపందాలిస్తే అమెరికా ఆర్థికవ్యవస్థ మరింత కుంగిపోవటం ఖాయం. పైగా లండన్‌తో పాటు ప్రపంచంలోనే కీలకమైన బంగారం కేంద్రంగా వెలిగిపోతున్న న్యూయార్క్ కళ అడుగంటుతుంది. అందుకే ట్రంప్ పునరాలోచనలో పడ్డారా? లేక ముందస్తు సమాచారం ఇచ్చిన ఇరాన్ 'మంచితనం' నచ్చిందా? మొత్తానికి అగ్ని గుండం కాబోతున్న పశ్చిమాసియాలో సామరస్య గాలులు వీచటం ఆహ్వానించదగ్గది. ఇది పూర్తి స్థాయిలో సాకారం కావాలని ఆశించాలి.

## హస్తకళలపై సావనీర్ డిజైన్ పోటీలు

విజయవాడ, చేనేత హస్త కళాకారులు, కార్మికులు, డిజైన్స్, చేతిపనుల పట్ల మక్కువ కలిగి సృజనాత్మక అభిరుచి కలిగిన ఔత్సాహికుల నుండి హస్తకళల పై సావనీర్ డిజైన్ పోటీలలో పాల్గొనేందుకు దరకాస్తులు కోరుతూ అవకాశం కల్పిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డా. పసుపులేటి హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని సాంప్రదాయ హ్యాండీక్రాఫ్ట్‌లు, హ్యాండ్లూమ్స్‌లలో కొత్త సావనీర్ డిజైన్లను సృష్టించేందుకు జాతీయ డిజైన్ సంస్థ రాష్ట్ర స్థాయి డిజైన్ పోటీలను నిర్వహించన్నట్లు ఆయన తెలిపారు. 8 సంవత్సరాల వయస్సు పైబడి రాష్టానికి చెందిన కళాకారులు, వీవర్స్, డిజైనర్లు, విద్యార్థులు ప్రజలు పోటీలలో పాల్గొన వచ్చునని తెలిపారు. హస్తకళలపై సామర్థ్యాన్ని పెంచడం, సాంప్రదాయ కళాకృతులు, ఆధునిక డిజైన్లను కలిపిన కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. హ్యాండీక్రాఫ్ట్స్‌కు సంబంధించి ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన కొండపల్లి బొమ్మలు, అనకాపల్లి జిల్లాకు చెందిన ఎటికొప్పాక బొమ్మలు, తిరుపతి జిల్లాకు చెందిన చెక్కతో చెక్కవేతనం, కృష్ణా జిల్లాకు చెందిన కళంకారి బ్లాక్ ప్రింట్స్, శ్రీసత్య సాయిజిల్లాకు చెందిన చర్మపప్పేట్రీ అంశాలపై ధర్మవరం సిల్క్, ఉప్పాడ సిల్క్, వైస్ట్ కోట్స్, మంగళగిరి, బందర్, రాజమహేంద్రవరం, కృష్ణ, తూర్పు గోదావరి జిల్లాల హ్యాండ్లూమ్స్‌లపై పోటీలను నిర్వమిస్తున్నట్లు తెలిపారు. హ్యాండీక్రాఫ్ట్ ఆంధ్రప్రదేశ్ సావ్‌నీర్‌లలో న్యూమాటిక్, ఆటోమేషన్, కొత్త డిజైన్లను హ్యాండ్లూమ్స్‌లో పాల్స్, స్కార్ఫ్, టైస్, వైస్ట్ కోట్స్ వంటి ఉపయుక్త వస్తువులను పరిచడం చేయాలన్నదే పోటీల ప్రధాన ఉద్దేశమన్నారు. ÷రిలిటీలలో వివిధ విభాగాలకు చెందిన ముగ్గురు ఉత్తమ విజేతలకు నగదు బహుమతులు ఇవ్వడం జరుగుతుందని, హ్యాండీక్రాఫ్ట్, హ్యాండ్లూమ్స్‌లలో ఒక్కొక్క విభాగంలో ఐదుగురు మొత్తంగా పదిమందికి మొదటి బహుమతిగా 25 వేల రూపాయలు, రెండవ బహుమతిగా 15 వేల రూపాయలు, మూడవ బహుమతిగా 10 వేల రూపాయలను పారితోషకంగా అందించడం జరుగుతుందన్నారు. జూలై 16వ తేదీ లోగా కొత్తగా సృష్టించిన సావనీర్ సమూనాలను రాష్ట్రంలోని సమీప లేపాక్షి, ఆప్కో షోరూమ్‌లలో సమర్పించాలన్నారు. పోటీల పక్రియను లేపాక్షి వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం విశ్వ పర్యవేక్షిస్తారన్నారు.

## కావాలనే కొందరు దీనిని తక్కువ చేసే యత్నం

వాషింగ్టన్, ఇరాన్‌పై జరిగిన అమెరికా వైమానిక దాడులు ఆ దేశ న్యూక్లియర్ సౌకర్యాలను పూర్తిగా ధ్వంసం చేశాయని డొనాల్డ్ ట్రంప్ చెబుతున్నారు. కానీ పలు మీడియా నివేదికల నేపథ్యంలో ఇరాన్.. న్యూక్లియర్ కార్యక్రమాన్ని కొన్ని నెలలు మాత్రమే వాయిదా వేశాయని చెబుతున్నాయి. ఈ నివేదికలను ట్రంప్ నకిలీ వార్తలని తోసిపుచ్చారు. ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఎ÷-లాట్‌ఫామ్‌లో ఒక పోస్ట్‌లో ఇలా పేర్కొన్నారు. ఈ వార్తలు ప్రచురించే సీఎన్ఎన్, న్యూయార్క్ టైమ్స్‌లు కలిసి ఈ చారిత్రక విజయవంతమైన సైనిక దాడిని చిన్నబుచ్చే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఇరాన్‌లోని న్యూక్లియర్ సౌకర్యాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ మీడియా సంస్థలు ప్రజల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నాయని ట్రంప్ తెలిపారు. వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కూడా ఈ నివేదికలను పూర్తిగా తప్పు అని తిరస్కరించారు. ఈ నివేదికలు ట్రంప్‌ను అవమానించేందుకు చేసిన ప్రయత్నమని ఆమె అన్నారు. 14 లక్షల కిలోల బాంబులను ఖచ్చితంగా లక్ష్యంపై వేస్తే ఏమవుతుందో అందరికీ తెలుసని అన్నారు. డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (ఆఎం) నివేదిక ప్రకారం, జూన్ 22న అమెరికా ఇరాన్‌లోని మూడు న్యూక్లియర్ కేంద్రాలైన ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్‌లపై దాడులు జరిపింది. అయితే ఈ దాడుల్లో ఇరాన్ న్యూక్లియర్ ప్రధాన భాగాలను ధ్వంసం కాలేదని , కేవలం కొన్ని నెలల తర్వాత వాయిదా వేశారని ఈ నివేదిక చెబుతోంది. ఈ సౌకర్యాలకు నష్టం జరిగినప్పటికీ, ఇరాన్ న్యూక్లియర్ మౌలిక సౌకర్యాలు చాలా వరకు సురక్షితంగా ఉన్నాయని తెలుస్తోంది. ఈ షయంపై సమాచారం ఇచ్చిన ఇద్దరు వ్యక్తులు, గుర్తింపు వెల్లడించకుండా, ఈ దాడులు ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్ సౌకర్యాలకు నష్టం కలిగించినప్పటికీ, వాటిని పూర్తిగా ధ్వంసం చేయలేకపోయాయని చెప్పారు. ఇరాన్‌లోని అత్యంత సుసంపన్నమైన యురేనియం కొన్ని స్థలాల నుంచి దాడులకు ముందే తరలించబడి సురక్షితంగా ఉందని, సెంట్రిఫ్యూజ్‌లు కూడా చాలా వరకు సురక్షితంగా ఉన్నాయని వారు తెలిపారు. ఫోర్డోలోని లోతైన భూగర్భ యురేనియం శుద్ధి కర్మాగారం వద్ద ప్రవేశ ద్వారం కూలిపోయింది. మౌలిక సౌకర్యాలకు నష్టం జరిగింది. అయితే, భూగర్భంలోని ప్రధాన నిర్మాణాలు ధ్వంసం కాలేదని ఒక వ్యక్తి తెలిపారు. గతంలో జరిగిన అంచనాలు కూడా ఈ ఫలితాన్ని హెచ్చరించాయని ఆ వ్యక్తి చెప్పారు. ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ దాడులు పూర్తి విజయవంతమయ్యాయని చెప్పినప్పటికీ, డిఐఏ నివేదిక వారి వాదనలను ఖండిస్తోంది. ఈ దాడులు ఇరాన్ న్యూక్లియర్ కార్యక్రమాన్ని గణనీయంగా దెబ్బతీసినప్పటికీ, దానిని పూర్తిగా నాశనం చేయలేకపోయాయని నివేదిక స్పష్టం చేస్తోంది. ఇది అమెరికా, ఇజ్రాయెల్ నాయకుల వాదనలకు విరుద్ధంగా ఉంది. ఈ వివాదం ప్రస్తుతం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది.

## అప్పటి కాంగ్రెస్ అధికార దాహానికి నిదర్శనం

అమరావతి,1975 జూన్ 25న విధించిన ఎమర్జెన్సీ స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యంత చీకటి అధ్యాయాలలో ఒకటని.. ఇది కేవలం ఒక రాజకీయ సంఘటన కాదు.. ఇది రాజ్యాంగానికి ప్రత్యక్ష ద్రోహమని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం.. అప్పటి కాంగ్రెస్ నాయకత్వం అధికార దాహానికి చిహ్నమని అన్నారు. పత్రికలను అణచివేశారని, ప్రతిపక్షాల గొంతు నొక్కివేశారని, ప్రాథమిక హక్కులను నిలిపివేశారని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్, అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్.కె.అద్వానీ, జార్జ్ ఫెర్నాండెజ్, మొరార్జీ దేశాయ్ వంటి గొప్ప నాయకులు అనేక మంది ప్రజాస్వామ్య రక్షణ కోసం నిలబడి జైలు పాలయ్యారని పవన్ కల్యాణ అన్నారు. ఈ రాజ్యాంగ ద్రోహానికి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నియంతృత్వానికి వ్యతిరేకంగా నిర్భయంగా నిలబడి మన ప్రజాస్వామ్య గౌరవాన్ని నిలబెట్టిన వారి త్యాగాలను గుర్తు చేసుకోవడానికి 'సంవిధాన్ హత్య దివస్'ను పాటిస్తామని అన్నారు. అణచివేతకు వ్యతిరేకంగా నిలబడిన నాయకుడు చేసిన త్యాగాలను, వారి గొంతులను అణచివేసిన లక్షలాది మంది వేదనను గుర్తుచేసుకుందామన్నారు. నేటికీ, రాజకీయాల పేరుతో మన రాజ్యాంగాన్ని రాజీ చేసే ఏ ప్రయత్నానికైనా దూరంగా ఉండాలని పవన్ కల్యాణ్ అన్నారు.

# జూబ్లీహిల్స్ బైపోల్ : సర్వేల్లో గెలుపు వారిదే.. సంచలనం



హైదరాబాద్,జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉప ఎన్నికపై రాజకీయ వేడి పీక్స్‌కి చేరింది. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీలన్నీ బైపోల్‌కి సీరియస్‌గా తలపడ్డాయి. ఇప్పటికే బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు తమ వ్యూహాలపై కసరత్తు ప్రారంభించాయి. తాజా సర్వేలో వెలుగులోకి వచ్చిన విషయాలు ఈ బైపోల్‌కు మరింత ఆసక్తికర మలుపు తీసుకొచ్చాయి.

**బీఆర్ఎస్‌కు ప్రతిష్ఠాత్మక బైపోల్**

ఇది తమ సిట్టింగ్ సీటు కావటంతో బీఆర్ఎస్‌కు ఇది గౌరవంగా మారింది. గోపీనాథ్ కుటుంబానికి సీటు ఇవ్వాలన్న ఆలోచనలో బీఆర్ఎస్ ఉన్నా, గోపీనాథ్ సతీమణి సునీత ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ఆమె అభ్యర్థిత్వంపై ఒక నిర్ణయానికి రాకపోతే, విష్ణు వర్ధన్ రెడ్డిని రంగంలోకి దించాలన్న ఆలోచన బీఆర్ఎస్‌దే. అయితే, సర్వేల ప్రకారం మాగంటి కుటుంబం అభ్యర్థిగా ఉండే పరిస్థితుల్లో బీఆర్ఎస్‌కు ఎక్కువ మద్దతు లభించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

**కాంగ్రెస్ వ్యూహం.. ఎంఐఎం కీలకం**

కంటోన్మెంట్ ఉప ఎన్నిక విజయం తరువాత కాంగ్రెస్ జూబ్లీహిల్స్‌ను గెలుచుకోవాలన్న పట్టుదలతో ఉంది. ఇప్పటికే మాజీ క్రికెటర్, హైదరాబాదీ లీడర్ అజహరుద్దీన్ తాను పోటీ చేస్తానని ప్రకటించారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి మాత్రం అభ్యర్థి ఎంపిక పార్టీ హైకమాండ్ నిర్ణయమని తేల్చేశారు. ఇదే సమయంలో ఎంఐఎం పోటీ చేస్తుందా లేదా అన్నది కాంగ్రెస్‌కు కీలకంగా మారనుంది. ఎంఐఎం గెలవకపోయినా.. దాని సహకారం ఏ పార్టీకైనా ఓటు తేడాను ప్రభావితం చేసే పరిస్థితి ఉంది.

**బీజేపీకి స్ట్రాటజిక్ ప్లాన్**

జూబ్లీహిల్స్‌లో బీజేపీ నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్త పేరు వినిపిస్తున్నా, అధికారికంగా ఎవరినీ ప్రకటించలేదు. టీడీపీ, జనసేనల మద్దతుతో ఉమ్మడి అభ్యర్థిని ప్రకటించాలని బీజేపీ ఆలోచన చేస్తోంది. ఈ మూడు పార్టీలు కలిసి పోటీ చేస్తే ఓటు బ్యాంక్ లో కొంత మార్పు రావొచ్చన్న అంచనాలున్నాయి.

**సర్వేల ప్రకారం గెలుపు తేల్చలేము**

ఇప్పటికే అన్ని ప్రధాన పార్టీలు సర్వేలు చేయించుకున్నాయి. కానీ ఈ సర్వేల్లో ఎవరూ ఏకపక్షంగా లేరు. ప్రజల మూడ్ ఇంకా స్పష్టంగా కనిపించకపోయినా, అభ్యర్థుల ఎంపిక తర్వాత రాజకీయ సమీకరణాల్లో మార్పు రావచ్చని నిపుణుల అంచనా. ఎంఐఎం పోటీ, కాంగ్రెస్ అభ్యర్థి నిర్ణయం, బీఆర్ఎస్ అభ్యర్థిత్వంపై స్పష్టత వచ్చిన తర్వాతే వాస్తవ గణాంకాలు బయటపడే అవకాశం ఉంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఈసారి రాజకీయంగా పెద్ద పోరుగా మారుతోంది. ఈ ఉప ఎన్నిక ఫలితం గ్రేటర్ హైదరాబాద్ రాజకీయాలకు దిశానిర్దేశం చేసేలా ఉండే అవకాశం కనిపిస్తోంది. అక్టోబర్‌లో ఈ ఎన్నిక జరిగే అవకాశముండటంతో వచ్చే నెలల్లో రాజకీయ వేడి మరింత పెరగనుంది. ఇక గెలుపు గులాబీదా? చేతివాటం కమలం పార్టీదా? లేక మరోసారి కౌంటర్ కొట్టే హస్తమా? అనే దానిపై తుది తీర్పు మాత్రం ప్రజల తీర్పునే నిర్ణయిస్తుంది.

# కో లివింగ్ కల్చర్ హైదరాబాద్ లో బంద్ చేయాలి



హైదరాబాద్,హైదరాబాద్ నగరంలో కొత్తగా పెరిగిపోతున్న కో–లివింగ్ కల్చర్ పై కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు (వీహెచ్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడ, మగ కలిసి ఒకే రూంలో నివసించే పద్ధతిని తక్షణమే నిలిపివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రేమ హత్యలకు కోలివింగ్ కారణమా?**

వీహెచ్ మాట్లాడుతూ గతంలో తెలంగాణలో ఫ్యాక్షన్ హత్యలు ఎక్కువగా జరుగుతాయని ప్రజలు భయపడేవారు. అయితే ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. కోలివింగ్ సాంప్రదాయం వల్ల ప్రేమ హత్యలు, కుటుంబ హింస కేసులు పెరిగిపోతున్నాయన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు వచ్చి ఉద్యోగాలు చేసే యువత ఒకే హాస్టల్ లేదా రూమ్‌లో నివసించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇది మానసిక, సామాజిక సమస్యలకు దారి తీస్తుందని హెచ్చరించారు.

**హైదరాబాద్ నెంబర్ వన్ సిటీ కావాలంటే...**

“హైదరాబాద్‌ను దేశంలో నెంబర్ వన్ సిటీగా నిలబెట్టాలంటే ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలను వెంటనే కట్టడి చేయాలి. కోలివింగ్ హాస్టల్స్ పేరుతో జరుగుతున్న అనైతిక వ్యవహారాలపై చర్యలు తీసుకోవాలి,” అని ఆయన స్పష్టం చేశారు.

**సోషల్ మీడియాకు విజ్ఞప్తి**

ఇటీవల జరుగుతున్న భయానక సంఘటనల గురించి మాట్లాడుతూ, “అక్కను చంపుడు, తల్లిని చంపుడు, భార్యను చంపుడు, భర్తను చంపుడు” వంటి వార్తలు తరచూ వస్తున్నాయని, ఇవి సమాజాన్ని కలవరపెడుతున్నాయని వీహెచ్ తెలిపారు. “ఇలాంటి హింసాత్మక వార్తలు కొంచెం తక్కువగా ప్రచురించండి,” అంటూ సోషల్ మీడియా వేదికలకూ విజ్ఞప్తి చేశారు.

**సమాజం కోసం ప్రభుత్వ జోక్యం అవసరం**

సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న నగరమైన హైదరాబాద్‌లో నైతిక విలువలు కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉందని వీహెచ్ పేర్కొన్నారు. కోలివింగ్ ద్వారా స్వేచ్ఛ పేరుతో జరిగే అశాంతికి బ్రేక్ వేయాలని కోరారు. అభివృద్ధితో పాటు సంస్కారాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, నగరం బుద్ధిగా, భద్రంగా ఉండాలంటే ఇది అత్యవసరమని అన్నారు. హైటెక్ సిటీలో కో లివింగ్ స్పేసెస్ పెడుతున్నారు. ఒకే రూంలో అమ్మాయిలు, అబ్బాయిలు కలిసి ఉంటున్నారు ఇలాంటి కో లివింగ్ కల్చర్ ఆపాలని సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబును కోరుతున్నాను. హైదరాబాద్ నెంబర్ వన్ సిటీ కావాలంటే ఇలాంటి వాటిని కట్టడి చేయాలి హైదరాబాద్‌లో కోలివింగ్ హాస్టల్స్ బంద్ చేయాలన్న వీహెచ్బిహార్, మధ్యప్రదేశ్ లాంటి ప్రాంతాల నుంచి వచ్చినవాళ్లతో ఆడపిల్లలు కోలివింగ్ స్పేసెస్‌లలో ఉంటున్నారు ఇటువంటి చర్యల వల్ల నేరాలు పెరుగుతాయన్న మాజీ ఎంపీ వీ హనుమంతరావు.

# కాంగ్రెస్‌లో అయోమయం అసలేం జరిగింది?




హైదరాబాద్,అధికార పార్టీ అంటేనే నేతల్లో ఉత్సాహం వెల్లువెత్తుతుంటుంది. జోష్ కొట్టొచ్చిన ట్లు కన్పిస్తుంది. వచ్చిపోయే కార్యకర్తలను కలుస్తూ నేతలు ఎప్పుడూ ఫుల్ బిజీ గా కన్పిస్తుంటారు. అదేం చిత్రమో కానీ, కరీంనగర్ కాంగ్రెస్‌లో మాత్రం ఆ హుషారు కన్పించడం లేదట. దీంతో.. కేడర్ మొత్తం అయోమయంగా ఉందట . స్థానిక సంస్థల ఎన్నికలకు ఓ వైపు పార్టీలు సన్నద్ధమవుతున్న వేళ ప ఉన్న పార్టీలో ఈ సైలెన్స్ దేనికి సంకేతం అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయట.

**ఉత్తర తెలంగాణలో కీలకంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా**

తెలంగాణలో పొలిటికల్ యాక్టివిటీ ఎక్కువగా కన్పించే జిల్లాల్లో కరీంనగర్ చాలా ప్రధానమైనది. ఎంతో మంది పేరున్న నేతలు ఇక్కడి నుంచి వివిధ పార్టీల తరఫున ప్రాతినిథ్యం వహిస్తున్నారు. కేంద్ర మంత్రులుగా, రాష్ట్ర మంత్రులుగా తమదైన శైలిలో రాజకీయాలు చేస్తున్నారు. పొలిటికల్‌గా ఇంతటి ప్రాధాన్యం ఉన్న చోట.. అదీ చేతిలో పవర్ ఉన్న కాంగ్రెస్‌లో అంతా అయోమయ పరిస్థితులు నెలకొన్నాయట. కీలక నేతలు ఎవరికి వారుగా తమ తమ బిజీ షెడ్యూల్‌లో ఉండడంతో ఇతర పార్టీల నుంచి వచ్చి హస్తంలో చేరేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపడం లేదట.

**స్థానిక సంస్థల ఎన్నికలకు రెడీ అవుతున్న పార్టీలు**

ఇదేదో ఆషామాషీగా చెబుతోంది కాదు. ఓవైపు అన్ని పార్టీలు ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాయి. మరో రెండు నెలల్లో జరుగుతాయని భావిస్తున్న లోకల్ బాడీ ఎన్నికలకు అస్త్రశస్త్రాలు సిద్ధం చేయడమే కాదు.. క్షేత్రస్థాయిలో ఉన్న కీలక నాయకులను, కేడర్‌ను తమ వైపు ఆకర్షించడంలో బిజీగా ఉన్నాయి. బీజేపీ ఎంపీ, కేంద్రమంత్రిగా ఉన్న బండి సంజయ్, మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత గంగుల కమలాకర్ ఈ విషయంలో ఆయా పార్టీల నుంచి కీలక పాత్ర పోషిస్తున్నారట. బీజేపీ, బీఆర్ఎస్ పరిస్థితి ఇలా ఉంటే.. రాష్ట్రంలో పవర్‌లో ఉన్న కాంగ్రెస్ మాత్రం ఈ విషయంలో కొంత వెనుకడుగులో ఉందన్న అభిప్రాయాన్ని జిల్లా నాయకులే చెబుతున్నారట. ఇదే ఇప్పుడు అత్యంత ప్రాధాన్య అంశంగా మారిందట.

**లోకల్ బాడీ ఎన్నికల్లో పైచేయి కోసం పార్టీల ఆరాటం**

కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని తీసుకుంటే.. ఇక్కడ సుమారుగా 3 లక్షలా 70 వేల ఓట్లు ఉన్నాయి. జిల్లా కేంద్రం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఎక్కువగా ఇక్కడే స్థిరపడుతున్నారు. ఇక్కడ పట్టుపెంచుకున్న పార్టీలు.. ఈ నియోజకవర్గం ప్రభావం..జిల్లాలోని ఇతర కేంద్రాలపైనా పడుతుంది. అందుకే జిల్లాపై పైచేయి సాధించేందుకు పొలిటికల్ పార్టీలు తహతహలాడుతుంటాయి. ఇంతటి కీలకమైన చోట అధికార కాంగ్రెస్‌లో మాత్రం పరిస్థితి సైలెంట్‌గా ఉందన్న మాట విన్పిస్తోంది. అసలు.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ మూడో స్థానానికి పరిమితమైంది. ఇక, హస్తం అభ్యర్థి శ్రీనివాస్ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని.. కాంగ్రెస్ నుంచి బహిష్కరించారు. ఉన్న కొంత మంది నేతల మధ్య విభేదాలు సైతం తీవ్రస్థాయిలో ఉన్నాయని ప్రచారం సాగుతోంది. బయటకు అంతగా కన్పించకపోయినా అంతర్గతంగా రగులుతున్నాయట.

**రాష్ట్ర కేబినెట్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు**

నిధానికి.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో ముగ్గురు మంత్రులు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. అయినా సరే వారి బిజీ షెడ్యూల్ కారణంగా ఇక్కడ పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టలేకపోతున్నారనే మాట విన్పిస్తోంది. ఇప్పటి వరకు ఎలా ఉన్నా.. మరో రెండు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. ఉత్తర తెలంగాణలోనే కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అతి పెద్దది. ఇక్కడ మొత్తం 66 డివిజన్‌లు ఉన్నాయి. దీంతో.. ఇక్కడ జెండా ఎగురవేయడం అన్ని పార్టీలకూ ప్రతిష్టాత్మకం. దీంతో.. ఏ పార్టీకి ఆ పార్టీ తమదైన వ్యూహ ప్రతివ్యూహాల్లో నిమగ్నమైంది. కీలకమైన, బలమైన నాయకులను తమ పార్టీలోకి ఆహ్వానించే పనిని ముమ్మరంగా చేపడుతున్నారు. కానీ, అధికార కాంగ్రెస్‌లో మాత్రం ఇప్పటి వరకు అలాంటి హడావిడి, జోష్ ఏదీ కన్పించడం లేదని కేడర్ గుసగుసలాడుతోందట. సహజంగానే ఒక పార్టీ అధికారంలో ఉందంటే.. ఎలాంటి ఎన్నికలు వచ్చినా సంబంధిత పార్టీ నుంచి పోటీ చేసేందుకు ఆశావహులు క్యూకడుతుంటారు. బడా నేతలను ప్రసన్నం చేసుకొని ఎలాగైనా టికెట్ సాధించేందుకు ప్రయత్నాలు చేస్తుంటారు. కానీ, కరీంనగర్ కాంగ్రెస్‌లో అలాంటి ఛాయలేవీ కన్పించడం లేదన్నది సామాన్య కార్యకర్త సైతం చెప్పే మాట. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి రాష్ట్ర కేబినెట్‌లో ప్రస్తుతం ముగ్గురు మంత్రులు ఉన్నారు. హుస్నాబాద్ నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న పొన్నం ప్రభాకర్..కీలక శాఖలు నిర్వహిస్తూ క్షణం తీరిక లేకుండా ఉన్నారు. దీంతో ఆయన జిల్లాపై పెద్దగా దృష్టి పెట్టలేని పరిస్థితి. మరో మంత్రి శ్రీధర్ బాబుది సైతం ఇదే పరిస్థితి. ఐటీ శాఖ మంత్రిగా ఉంటూ అనుక్షణం సీఎం రేవంత్ రెడ్డికి చేదోడు వాదోడుగా ఉంటూ వస్తున్నారాయన. ఏదైనా కొంత తీరిక సమయం దొరికితే తన నియోజకవర్గంతోపాటు పెద్దపల్లి జిల్లా ఎమ్మెల్యేతో సమన్వయం చేసుకుంటున్నారాయన. ఇక, కొత్తగా మంత్రి అయిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతానికి ఆయన ఫోకస్ ఎక్కువగా తన నియోజకవర్గంతోపాటు జగిత్యాల జిల్లాపైనే ఉందని చెప్పాలి.

**మంత్రుల బాధ్యతల్లో ముగ్గురూ ఫుల్ బిజీ**

ఇలా ఉన్న ముగ్గురు మంత్రులూ ఊపిరి సలపలేనంత బిజీగా ఉన్నారు. ఇక, గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లా అధ్యక్షుడిగా ఉన్న కవ్వంపల్లి సత్యనారాయణ.. మానకొండూరు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఎక్కువగా తన నియోజకవర్గంపైనే ఫోకస్ చేసే పరిస్థితి నెలకొందట. దీంతో.. ఇప్పుడు జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఎవరైనా ఇతర పార్టీల నాయకులు భావిస్తే తమకు అండగా ఎవరు ఉంటారు.. ఎవరిని నమ్ముకొని హస్తం కండువా కప్పుకోవాలో తెలియడం లేదని గుసగుసలాడుతున్నారట. ఫలితంగానే జిల్లా కాంగ్రెస్‌లోకి పెద్దగా చేరికలు లేవన్న టాక్ విన్పిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకొని పనిచేయాలని నేతలకు ఇప్పటికే సూచించారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు ఎలా ఉన్నా.. ఇకపైనా ఆయా మంత్రులు జిల్లా రాజకీయాలపై గట్టిగా ఫోకస్ చేయాలని కోరుతున్నాయి పార్టీ శ్రేణులు.

# ఆరోగ్య తెలంగాణకు కట్టుబడ్డాం..



హైదరాబాద్,ఆదాయాన్ని సృష్టించి, పెద్ద ఎత్తున ఉపాధి సృష్టించే కుటీర పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించి, ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసిన బీసీ చేతి వృత్తి కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకానికి సంబంధించిన స్టాల్స్ ను భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాకారులు, చేతివృత్తులు సమాజానికి పెద్ద ఎత్తున ఉపయోగపడతాయని చెప్పారు. ఈ నెల 25 నుంచి 29 వరకు చేతివృత్తుల ప్రదర్శన కొనసాగుందని పేర్కొన్నారు. ఈ ఎగ్జిబీషన్ ను రాష్ట్ర ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు భట్టి విక్రమార్క. హైదరబాద్ నగరానికి చెందిన వారే కాకుండా ఇతర జిల్లాల నుంచి చేతివృత్తుల కళాకారులు చేసిన వస్తువులు, కుటీర పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తుల ఎగ్జిబీషన్ ఉంటుందన్నారు. ఈ ప్రదర్శనను సందర్శించి నచ్చిన వస్తువులు, పర్యావరణహితమైన ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు. దీంతో చేతివృత్తుల కళకారులకు చేయూతగా ఉంటుందని సూచించారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం బీసీ కార్పొరేషన్లపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయిస్తున్నదని పేర్కొన్నారు. ఈ ఎగ్జిబీషన్ లో కుమ్మరులు తయారుచేసిన మట్టి పాత్రలు, మేదరి వారు తయారు చేసిన వెదురు వస్తువులు, పూసల వారి సామగ్రి వస్తువులు, అదే విధంగా పోచంపల్లి, గద్వాల, నారాయణపేట మొదలైన చేనేత ఉత్పత్తులను, నీరా ఉత్పత్తులు, వారు తయారు చేసిన వస్తువులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పరిశీలించి వస్తువులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బెస్త వారు ఏర్పాటు చేసిన చేపల వంటకాలను మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, వాకిటి శ్రీహరి లతో కలిసి డిప్యూటీ సీఎం ఆరగించారు.

# స్థానిక సమారానికి సై...మూడునెలల్లో కొత్త పాలకమండళ్లు



హైదరాబాద్,గతేడాది అంటే 2024 ఫిబ్రవరి 1వ తేదీతో సర్పంచ్‌ల పదవి కాలం ముగిసింది. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. సెప్టెంబర్ 30 లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఎన్నికల సంఘానికి, ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.గతేడాది అంటే 2024 ఫిబ్రవరి 1వ తేదీతో సర్పంచ్‌ల పదవి కాలం ముగిసినా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేకపోయింది. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. సెప్టెంబర్ 30వ తేదీ లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఎన్నికల సంఘానికి, ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉండగా, ఎన్నికల నిర్వహణపై హైకోర్టులో నల్గొండకు చెందిన సర్పంచ్‌లు పిటిషన్ వేశారు. ఈ విషయమై రిజర్వేషన్లు, వార్డు డివిజన్ ప్రక్రియ చేపట్టడానికి 25 రోజుల సమయం కావాలని ప్రభుత్వం కోర్టును కోరింది. అదే సమయంలో కనీసం 60 రోజుల సమయం కావాలని ఎన్నికల కమిషన్ కోరింది. ఇరువురి వాదనలు విన్న హైకోర్టు సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు నిర్వహించాలని తీర్పునిచ్చింది.

**రిజర్వేషన్ల పై కసరత్తు**

స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడానికి ప్రభుత్వం సిద్దంగా ఉన్నప్పటికీ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీని అమలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దన్న సుప్రీంకోర్టు నిబంధనతో ప్రభుత్వం ఏం చేయాలన్న దానిపై దృష్టి సారించింది. కేంద్రం నుంచి బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు గ్రీన్ సిగ్నల్ రాకపోతే పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇవ్వడానికి సిద్ధమవుతోంది. అంటే 42 శాతం మంది బీసీలకు టికెట్లు ఇచ్చే ఆలోచనలో కాంగ్రెస్ ఉంది.

**రాష్ట్రంలో గ్రామ పంచాయతీలు 12,633**

2019 ఎన్నికల ప్రకారం రాష్ట్రంలో 12,848 గ్రామ పంచాయతీలున్నాయి. ఆ తర్వాత వాటిలో 71 గ్రామాలు ఫ్యూచర్ సిటీలో విలీనమైనందున మిగిలినవి 12,777 గ్రామ పంచాయతీలు. వీటిలో కొన్ని మున్సిపాలిటీల్లో విలీనం కాగా మిగిలినవి 12,633 గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు జరుగనున్నాయి. గతంలో మహిళలకు 50% రిజర్వేషన్ అమలైనందున ఈసారి కూడా వారికి సగం సీట్లు దక్కనున్నాయి. గతంలో 2.02 కోట్ల జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలుచేశారు. ఇప్పుడు కొన్ని గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనమైనందున గ్రామీణ జనాభా 1.90 కోట్లకు చేరింది. దీని ప్రకారం ఈసారి బీసీలకు 20–22%, ఎస్సీలకు 18–20%, ఎస్టీలకు 8–10% సీట్లు కేటాయించే అవకాశం ఉన్నది. రొటేషన్ అమలుకు ప్రభుత్వం చట్టం చేసినందున గతంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ స్థానాలు ఇప్పుడు మారుతాయి. ఎస్సీ సీటు బీసీ లేదా జనరల్‌కు కేటాయించే అవకాశం ఉంటుంది.గ్రామపంచాయతీలతో పాటు 539 మండల ప్రజా పరిషత్ పాలకవర్గాల గడువు నిరుడు ఫిబ్రవరి 1తో ముగిసింది. 28 జిల్లా పరిషత్ పాలకవర్గాల గడువు 2024 జూలై 5వ తేదీతో ముగియగా.. ము లుగు, ఖమ్మం, భద్రాచలం, మహబూబాబాద్ జెడ్పీలతోపాటు ఆ 4 జిల్లాల్లోని మండల పరిషత్ పాలకవర్గాల గడువు 2024 ఆగస్టు 5తో ముగిసింది. వీటన్నింటికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.

**మొదట గ్రామపంచాయతీ ఎన్నికలు**

ఇక గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మునిసిపాలిటీ స్థానిక సంస్థల్లో ముందుగా గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో మొత్తం12,633 పంచాయతీలు ఉన్నాయి. వాటన్నింటికి ఎన్నికలు జరుగుతాయి. ఈ పంచాయతీలన్నింటిలో సుమారు 1,13,500కుపైగా వార్డులున్నాయి. కాగా కొన్ని గ్రామ పంచాయతీలు మునిసిపాలిటీల్లో కలిసే అవకాశం ఉంది. ఆ పంచాయతీల్లోని వార్డులుపోగా.. మిగతా వాటికి ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. మరోవైపు 5,817 ఎంపీటీసీ, 567 ఎంపీపీ, 567 జడ్పీటీసీ స్థానాలకు కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు. జడ్పీటీసీ ఎన్నికలు ముగియగానే హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి మినహా మిగిలిన 31 జిల్లాల్లో జడ్పీ చైర్మన్లను ఎన్నుకోనున్నారు. ఈ ప్రక్రియనంత సెప్టెంబర్ 30 లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

# కేంద్ర కేబినెట్ భేటీలో లోకేష్‌పై మోదీ ప్రశంసలు!



న్యూఢిల్లీ,కేంద్ర కేబినెట్ భేటీలో ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేష్‌ల పనితీరును ప్రధాని మోదీ ప్రశంసించారు. యోగాడేను అత్యంత పకడ్బందీగా.. నిర్వహించిన తీరు ప్రధాని మోదీని బాగా ఆకట్టుకుంది. గత పదకొండేళ్లుగా తను యోగా దినోత్సవంలో వివిధచోట్ల పాల్గొన్నా.. అంత అనుభూతి రాలేదని కానీ విశాఖలో మాత్రం.. అద్భుతంగా అనిపించిందన్నారు. యోగాడే నిర్వహణపై ఏపీ ప్రభుత్వాన్ని తాను నివేదిక కోరానని అది రాగానే అన్ని రాష్ట్రాలకు పంపించి స్టడీ చేయమని చెబుతామన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం విశాఖలో గిన్నిస్ రికార్డు స్థాయిలో జరిగింది. అద్భుతమైన ప్లానింగ్ తో చిన్న పొరపాట్లు కూడా లేకుండా ఈ కార్యక్రమం జరగడం ప్రధాని మోదీని అబ్బురపరిచింది. అప్పుడే వేదిక మీదనే లోకేష్‌ను ప్రశంసించారు. అయితే ఆ పొగడ్తలు అప్పటికే అనుకున్నారు. కానీ కార్యక్రమం నిర్వహణ .. మొత్తం మోదీ మైండ్‌లో స్థిరపడి పోయిదని తాజాగా కేబినెట్ భేటీలో ప్రశంసలతో స్పష్టయింది. అమరావతి శంకుస్థాపనకు ప్రధాని మోదీ వచ్చినప్పుడు అదే వేదికపై నుంచి అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశాఖ రావాలని చంద్రబాబు ఆహ్వానించారు. అప్పుడే మోదీ కూడా అంగీకరించారు.నారా లోకేష్.. గిన్నిస్ రికార్డు టార్గెట్ గా పెట్టుకుని ఏ మాత్రం లోపాల్లేకుండా ఈ కార్యక్రమాన్ని ఎగ్జిక్యూట్ చేయడంలో కీలక పాత్ర పోషించారు. మూడు లక్షల మందికిపైగా ఒకే సారిశాఖ నుంచి బోగాపురం వరకు యోగా చేశారు. ఇది గిన్నిస్ సంస్థను ఆకట్టుకుం ది. ప్రత్యేకంగా ఈ ఘనత గురించి సోషల్ మీడియాలోనూ ప్రచారం చేసింది.

# మెట్రో విస్తరణపై కేంద్రం నిర్లక్ష్యం

న్యూఢిల్లీ,హైదరాబాద్ మెట్రో ఫేజ్–2పై కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. అనేక పర్యాయాలు కేంద్రమంత్రులను, ప్రధానిని కలిసి సిఎం విన్నవించినా ఆమోదం దక్కకపోవడం విచారకరమన్నారు. తాజాగా కేబినేట్‌లో ఈ అంశం చర్చించకపోవడం తెలంగాణకు తీరని అన్యాయమని భావిస్తున్నామని అన్నారు. దిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ముగ్గురు కేంద్రమంత్రులను కలిశారు. కేంద్రమంత్రులు కుమారస్వామి, పీయూష్ గోయల్, శ్రీపాద యశోనాయక్‌లను కలిసిన శ్రీధర్‌బాబు.. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించిన భూముల అంశంపై చర్చలు జరిపారు. సమస్యల పరిష్కారానికి కేంద్రం చొరవ చూపాలని కోరారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2పై కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. దీనిపై కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రధాని, కేంద్రమంత్రిని కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. మెట్రోపై ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం నిర్ణయం తీసుకోలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

Printed, Published & Owned by **MEDE SHANTHI KUMAR**, Printed at **SPOORTHI PRINTERS,** H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From **SPOORTHI PUBLICATIONS,** H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: **MEDE SHANTHI KUMAR.**